

కథా కౌముది

ఒక ఆలాపన

డా.బాలా త్రిపుర సుందరి

అలసి సొలసిన నయనాలు అరమోడ్పులవగానే పల్చటి మనో యవనిక సన్నగా కదిలి రెపరెపలాడుతూ స్వాప్నిక జగతి నుండి అలవోకగా జారి నన్ను స్పృశించింది. !

అంతకుముందు మనసంతా పరుచుకుని ఉక్కిరిబిక్కిరి చేసిన జ్ఞాపకాల నీడలూ, ఘనీభవించిన అనుభూతులూ. చిటపట రవ్వల చేదు అనుభవాలు, గతకాలపు వైభవం, అద్భుత దృశ్య కావ్యాలు, విషాదానందాల చిరుహాసం చిన్నగాకదిలి సన్నగా నవ్వి మెల్లగా మాయమైనాయి. ఒక ప్రశాంతలహరిలో చైతన్య స్రవంతినై మనసు తెప్పపై మత్తుగా మరో కలల ప్రపంచంలోకి అడుగు పెట్టాను.

సుదూర తీరాలనుండి గాలిలో తేలుతూ, నీలిమేఘాలను తాకుతూ, కొబ్బరి ఆకుల సందునుండి సర్రున సడిచేస్తూ, చేరువై దూరమై, మంద్రంగా వాయులీనమైన గానం వీవెనలా సేద తీర్చింది. !

కలలు కరిగి జారిపోకుండా కనురెప్పలు కవాటాలుగా మారి కంటిపాపలు మెల్లగా లాస్యం చేస్తుంటే మనసు నవ్వుతూ స్వప్నరాగలీనమై నా చిటికిన వేలందుకుంది

ఆవపిండి వర్ణపు చీరంచుల చివర చిరుమువ్వలు సందడి చేసే పద్మరాగ పాదాలు అందంగాకదులుతూ దూరంగా కనబడే అందమైన రంగుల దీవి చూపుడు వేలితో చూపిస్తూ చాలా దయగా నవ్వింది. !

అద్భుత సౌందర్య రాశి..!! అబ్బురపడుతూ ఆమె కళ్ళ వంక చూశాను, సోయగంగా కళ్ళువాల్చి నాకేసి చూస్తూ, ముత్యాలూ కెంపులూ రాశిపోసినట్లున్న దోసెడు పారిజాతాలు నా తలమీదుగా ముంగురులనిమంచుతూ మెల్లగా జార్చింది, సుకుమార స్నిగ్ధ సౌందర్యమంతా వొలికినట్టుగా ఆమె వేళ్ళ సందులనుండి ఒక్కొక్క పువ్వూ తెల్లగా నవ్వుతూ వేలికొసలమెరిసే అరుణ రాగాన్ని నా చెంపలకుపులుముతూ జలజలా కిందకు రాలుతున్నాయి. !

నేలరాలగానే సున్నితమైన పూలు వసి వాడినట్లు వన్నెలు కోల్పోయాయి. నేనూ కళ్ళెత్తి ఆశ్చర్యంగా చూశాను 'ఇదేమిటన్నట్లు. !'

భువనైక మోహనంగా నవ్వింది. పెదిమలు సాగి చివర్న సన్నటి వంపులోచిక్కుకున్న బింబరాగం మరింత చిక్కబడి ప్రభవించింది. మెరిసే తెల్లటి పలువరస గీతలా అరుణాధరా లకి ముత్తెపు సరాలైనాయి. వంగి నా భుజాలు పట్టుకుని మోకాళ్ళ మీద కూర్చున్నప్పుడు జలపాతం లాటి కేశపాశం తనభుజం మీదుగా ముందుకు పరచుకుని పచ్చని దోసపండులాటి మొహాన్ని సగానికి కప్పేసింది. ఆమె జుట్టు రంగు మరీ తుమ్మెదరెక్కల నలుపు కాదు కాస్త రాగి రాగి యెరుపులో తేనె మరికొంచెం గండుతుమ్మెద రెక్కల నలుపూ గాఢంగా కలిపితే వచ్చిన విలక్షణమైన వర్ణం. యెక్కడినుండో వచ్చి పడుతున్న సన్నని కాంతి రేఖలు ఆమె చెంపలూ, నుదురుల నునుపుదనం మీదనుండి పరావర్తనం చెంది ముంగురుల సోయగపు కాంతి మరింత శోభిల్లింది. ! ఫాలభాగాన మెరుస్తున్న యెర్రటి కుంకుమ రేఖ ముఖాన్ని కప్పేసిన వెంట్రుకల మధ్య తేనెరంగు మబ్బులో కుంగుతున్న అస్తమాన బింబంలా తళుక్కు మంది,!

కాస్త ముందుకి వంగడంతో మెడకింది వంపులు బరువుగా కదులుతూ సన్నని గోదారి పాయలో చిక్కుకున్న పచ్చలూ వజ్రాలూ పొదిగిన పతకం రాగలీన ఊపిరి సయ్యాటకి చిరుచెమటల చిత్తడికీ గిలిగింతలు పడుతూ ''ఇంతకంటే ఇంకేమి పరమపదం!'' అని ముసి ముసి గా నవ్వుకుంటున్నది.

పల్చటి చీర మడతలమధ్యగా గులాబీ, పసుపూ, పాలూ మేళవింపులో తేటదీరిన పసిడి మేనిఛాయ రంగులీనుతుంటే వింతగా చూస్తుండిపోయాను. తను నావంక చూసి మరింత దయగా నవ్వింది. ఆమె కళ్ళు సోగదేరి నిర్మలంగా తెల్లగా.. కంటి చివర కనీ కనబడని యె ఱ్ఱ జీరతో నల్లని కనుపాపతో దయ వర్షించడమే తమపని అన్నట్లుగా ఆర్ద్రతతో మెరుస్తున్నాయి. కనురెప్పలు పొడవుగా వింజామరలైతే, సహజంగానే కాటుకరేఖల నలుపు దిద్దుకున్న రెప్పలు రాచరికపు ఠీవితో మిలమిల మిడిసి పడుతున్నాయి! విల్లులా వంగిన కనుబొమ్మలు కళ్ళకి కాపలా కాస్తున్నట్లుగా అందంగా వంగి సాగాయి!

నా సంభ్రమం చూసి స్వప్నరాగలీన సందడిగా నవ్వింది. ధ్వజస్తంభం మీది చిరుగంటలు మోగాయి కాబోలు అనుకుంటు తలతిప్పాను.

తను కిందపడ్డ పారిజాతాలు యేరి నా ముందు పెడుతూ..

"ఇది నీ బాల్యం.చూశావా?" అంది.

" ఇది ఇది నా బాల్యమా?" అర్ధం కానట్లు చూసాను.

ఆమె తన మునివేళ్ళతో నా చుబుక మెత్తి నాకళ్ళలోకి చూసి నవ్వింది.

"నీ నవ్వు చాలా అందంగా వుంది,కానీ నువ్వెవరివి!?"

"ఊహు! ఇందాక అనుకున్నావుగా స్వప్న రాగలీన నని! మళ్ళీ యెవరని అడుగు తావేమి?" కాస్త కోపం అభినయిస్తూ, పెదిమలు బిగపెట్టింది.

"అవునవును. కానీ నేననుకున్నది నీకెలా తెలిసిందీ!?"

"యెందుకంటే నేను నీ కలల రాణిని కాబట్టి. నీ కనుపాపలలో నీకోసం స్వప్న సామ్రాజ్యం నిర్మించుతాను. దానికి నీవు,నేను,నేను,నీవు మహారాణులం!"

నా ముక్కు పట్టుకుని చిన్నగా ఊపుతూ సెలయేటి గలగలలుగా నవ్వులు చిందించింది

అయోమయంగా ఆశక్తిగా ఆమెవంకా అరచేతిలోని పూలవంకా చూశాను

"ఇందాక నా బాల్యం అన్నావు, ఈ పూలు!?"

"అవును. పారిజాతంలాటి బాల్యం. పరిమళ భరితమైన నీ చిన్నతనం, ఇది దేవపారిజాతం!"

"కానీ యీ పూలు నలిగి వాడిపోయాయి." విచారం నా స్వరంలో! ఆంతలోనే యేదో గుర్తుకొచ్చినట్లుగా ఉలిక్కి పడ్డాను!

"ఛఛ నువ్వు అబద్ధం చెప్తున్నావు. నేనిప్పుడు చాలా వయసు మీదపడ్డ పెద్దదాన్ని, మనుమలూ మనవరాళ్ళూ.."

నా పెదిమలమీద వెటకారపు నవ్వు, మాటలో వ్యంగపు విరుపూ"ఇప్పుడు బాల్యంలో వున్నానంటావేమిటి.?"

రాగలీన మొహం పైకెత్తి ఫక్కున నవ్వింది. బొండుమల్లెలు జలజలా రాలినట్లుగా..!

రోషంగా ఉక్రోషంగా చూశాను,

"అమ్మీ! నేనెందుకు నీతో హాస్యమాడతాను ?ఒక్కసారి నిన్ను నువ్వు చూసుకో పెదిమలు బిగించి తమాషాగా కళ్ళు రెప రెపలా డించింది. గబుక్కున తలవంచి నన్ను నేను చూసుకున్నా నుఆశ్చర్యం భయాందోళనలు నన్ను చుట్టు ముట్టాయి!

భయంగా తన మొహంలోకి చూసాను మృదువుగా నవ్వి నన్ను చేతుల్తో దగ్గరికి లాక్కున్నది.

ఇదేమిటి నేనిలా మారిపోయాను యేడుపు పొంగింది

వద్దు వద్దు నా కళ్ళల్లో నీ బొమ్మ చూసుకో నువ్వు నువ్వే

తళతళ లాడే ఆ కనుదోయి కంటిపాపల్లో నా ప్రతిబింబం..!!

ఆకుపచ్చని పట్టు పావడా, బుట్టచేతుల యెఱ్ఱ జాకెట్టు, ముందుకు వేసుకున్న మొగలిపూల జడా, కింద పిల్లకుప్పెలూ, పాపిడిబిళ్ళకి వేలాడే ముత్యాల సరాలు, నుదుటిమీద అల్లల్లాడే నల్లని ముంగురులూ, నుదుటిమీద దోస గింజ ఆకారంలో బొట్టు కళ్ళకి అందంగా దిద్దిన కాటుకా..!!

చిన్నప్పుడు అమ్మ నాకు మొగలిపూల జడ వేసి తీయించిన ఫొటోలో లాగా వున్నాను. !

నమ్మశక్యంగాని వివశతో తనచేతిని గట్టిగా పట్టుకున్నాను అందోళనంతా నాగుండెచప్పుడులో వినిపిస్తున్నది.

భయపడకు పువ్వులా నవ్వింది నాచేతులు ముద్దాడుతూ

"నీ చేతులకి గోరింటాకు యెంత యెఱ్ఱగా పండిందో "

ఆశ్చర్యంగా భయంగా నాచేతులవంక చూసుకున్నాను! మందార రంగుతో పండిన నా పచ్చని చేతులు బాల్యపు లావణ్యం సౌకుమార్యంతో లేలేత ప్రభలు వెదజల్లుతున్నాయి.

"ఇలా గోరింటాకు పెట్టుకుంటం పూలజడలు వేసుకుని పట్టుపరికిణీ కట్టుకుని అట్ల తద్దెకి ఆడుకుంటం నీకిష్టం కదా!"

“అవును కానీ " మాట పెగలలేదు.

"అందుకే నిన్ను ఇక్కడకు తీసుకొచ్చాను యెప్పుడూ నీమనసులో తలుచుకుని మురిసిపోయే ఈరోజు మళ్ళీ చూస్తావని!”

నన్ను తననుండి కాస్త దూరంగ నిలబెట్టి మెల్లిగా తల ఊపుతూ మంద్రస్వరాన పలకసాగింది.

“ఇది నీకలల ప్రపంచం. ఇది నీ సామ్రాజ్యం. ఇది నీకేసొంతం. ఇందులో – నీ జీవితపయనంలో నువ్వు అనుభూతి చెందిన ప్రతి ఆనందపు అనుభవమూ వుంటుంది. నీ బాల్యం నీయవ్వనంలోని ఒక్కొక్క క్షణం ఇంకా నీపయనంలోని పరమానంద స్మృతులూ--- నిన్ను కాలగతిలో వమ్ముచేసి యెడబాసినట్లుగా నీకనిపించినా అన్నింటినీ మనసు మూటకట్టుకుని పసిడి రెక్కలు పరచుకుని వచ్చివాలిన రాయంచ నెక్కి, అదిగో ఈలోకపు అంబరాన పరిమళ భరితమైన పూలుగా రంగు రంగుల విరులుగా, విరి మొయిలుగా జ్ఞాపకాల పందిరిలో గుబాళించే అనుభూతులన్నిటినీ పొదుగుతుంది. నీ వయసుతో గానీ నీ ఆర్థిక సామాజిక స్థితులతో గానీ పని లేదు నీకలల ప్రపంచంలోనికి నువ్వెప్పుడు తొంగి చూడాలన్నా విరి వాన కురిసి నిన్ను ఆ పందిరి కిందకు చేయిపట్టి లాక్కెళ్ళుతుంది!

ఒక్క క్షణం ఆగింది.

నేను స్థబ్దతతో వింటున్నాను నాకు యేమి అర్థమవుతున్నదో నాకే తెలియదు కానీ లోపలనుండి ఒక రకమైన ఉద్వేగపూరితమైన ఆనందం నన్ను ఊపేస్తున్నదని గ్రహించ గలుగుతున్నాను !

స్వప్న రాగలీన నన్ను వదిలి అంతకుముందు నాకు చూపిన దీవి వంక తిరుగుతూ "అదే అది నీ ప్రపంచం. అచ్చంగా నీకే. అందులో నీవు యే అనుభూతి పొందాలనుకుంటే అది నీ మనసు గిలి పెడుతూ నీలో మమేక మై నిన్ను అలరించుతుంది. నువ్వెంతకాలం ఆ పందిరిలో ఆడుకోవాలంటే అంతకాలం నీజ్ఞాపకం మళ్ళీ అస్థిత్వం పొంది నిన్ను పొదువుకుని నీ గతకాలపు వైభవాల్లోకి తీసుకెళుతుంది. గడిచిపోయిన ప్రతిక్షణం జ్ఞాపంగానే మిగిలి మనసులోపలి పొరలలో నిక్షిప్తమై వుంటుంది. నీ మనసు చైతన్య మై వున్నంతకాలం అనుభవాలు అనుభూతిగా

అనుభూతి జ్ఞాపకంగా! నిజానికి అనుభూతికి అస్థిత్వం జ్ఞాపకమే ఈ అమరత్వానికి భౌతికపరమైన మార్పులతో గానీ వయసుతో గానీ సంబంధం లేదు.''

నేను తనవంక విభ్రాంతిగా చూస్తున్నాను! తన మాటలు యేదో సంగీత లోకం నుండి ప్రవహించే సుర వాహినిగా నన్ను తడిపేస్తున్నాయి!

చెవికి చెవి ఆనించి సన్నటి గాలి సవ్వడిగా గుసగుస లాడుతున్న గిలిగింత!

మనసూ శరీరం తేలికగా దూది పింజల మేఘాలని చుట్టుకుంటూ వినీలాకాశంలో చేతులు చాచి ఆనంద లాస్య విన్యాసం చేసిన పరవశం!

నిర్నిమేషంగా చూస్తున్న నన్ను లాలనగా చూస్తూ మందహాసమే సవ్వడై ఆత్మీయంగా నన్ను తడుతూ మెల్లి మెల్లిగా వెనక్కి అడుగులువేస్తూ నాచేయి వదలింది,

"వద్దు వద్దు వెళ్ళద్దు. నన్నొదలద్దు, నాకు భయం కంగారుగా వుంది !

నాగొంతుకలో జీర మాటని చీరుస్తున్నట్లుగా,

నవ్వింది! నదిలో మువ్వల సవ్వడి!!

" ఇది అపురూపం నువ్వు రోజూ క్షణ క్షణం పలవరించిన నీ తీపి జ్ఞాపకమే,! ఒక్కసారి అనుభూతించు,

నీ అనుభూతులు అర్ణ వమైన వర్ణమాల, లోతుతెలియనివ్వని నడిసంద్రపు నీలిమ''

అంటూ మళ్ళీ దగ్గరగా వచ్చి ''చూడు నువ్వీ కలల లోకంలో చెరగని శిలాక్షరానివి. కాని స్పందించే హృదయాస్పదవి, కోరుకున్న ఘడియలో అమృతం ఆనందంగా చిలకరించగల ఆనంద రాగలీనవి

అందుకే నీ అక్షరాలు. కొన్నయినా లోపల ఇంకిపోతూంటాయి. ఇంకిపోయి మనసునో, ఆలోచననో కొంత సంపన్నం చేస్తాయి. కనీసం కనిపించని ఒక చిరువ్వుని పూయిస్తాయి. ఏదీ కాకపోతే స్పందనను ఎలా వ్యక్తం చేయాలో తెలియని మౌన ఆనందాన్ని మిగుల్చుతాయి.

అలవాటైన మాధుర్యమో, మనసులో కదిలే ఒక కూనిరాగమో కళ్ళ ముందు తారాడే ఒక ప్రతిబింబమో హృదయాన దోగాడే మరువపు పరిమళమో లేదా మామూలుగా చెప్పాలంటే అప్పుడే కలిగిన, ' ఆహా, లాంటి ఆనందమో కాసేపు కోల్పోయి మళ్ళీ అనుభూతించినట్లుగావుంది.

యెందుకో మనసులో కలవరం నీకు అని అడగను యెందుకంటే ఆ కలకలం లేకపోతే మనసు యెండిన బీడులా వుంటుంది.

అదివుంటేనే నదీ తీరాన వెన్నెలలో మెరిసిపోయే రెల్లుపొదల అందం మనదౌతుంది గాలికి తల వూపే కొబ్బరాకుల సవ్వడి సేదతీర్చుతుంది

నిజానికి మనసు భరించలేని విషాదాలేవీ వుండవేమో యెందుకటే ఆబరువు తీర్చుకోను తనకే స్వంతమైన సొత్తు కన్నీరు వుంది

పిచ్చి తల్లీ! యే నలుగురూ మన కన్నీటికి భాగస్వామ్యులు కాలేరు. చారికలలో తేలిన ఆ రుచి యెవరికీ పంచనీయదు మనసు ఒంటరి బ్రతుకులకి మన మనసే గొప్ప సాంత్వన గొప్ప కాపలా.

నీ కనుల రాలే ప్రతి వెచ్చటి బొట్టూ ఒక నెచ్చలై అలరించుతుంది..''

రాగలీన మేఘమాలలా పూలరేకులా, జారే తేనెచుక్కలా చందన మలదుకున్న పండుసంపెంగలా..

మెల్లగా సడిచేసే అలలాగా మళ్ళీతిరిగి నా చేయందుకుంది. నా చేతి వేళ్ళ సన్నని కంపన తనని మరింత దయగా దగ్గరకు చేర్చింది గాఢంగా చుట్టేసి

నా కళ్ళల్లోకి చూస్తూ "నీదైన కలలలోకం నీదే నీటిలో తేలియాడే పూర్ణ చంద్రబింబం, నీ అరచేతిలోని నీదైన వెన్నెల చకోరం, వెన్నెల ముక్క కోసం నిరీక్షించాలిగాని నువ్వే వెన్నెల. నీ స్వప్నమే జాబిలి. నీకెందుకు అష్ట నాయికల విలాపం నీ ప్రబంధానికి నీవే రాజ్ఞివి''

నాకళ్ళు గాఢ సుషుప్తిలోకి జారిపోతున్నాయి.

నీటిలోని కలువకన్నె కౌముదీ ప్రపంచంలో ఒళ్ళు విరుచుకుంటున్నది స్వప్నరాగలీన.

సడిచేయకుండా నాలో ఒదిగిపోయింది నా బాల్యం

నా కలలప్రపంచం నీలి ఆకాశపు పందిరిక్రింద చేతులు బారచాచి మొహమెత్తి నక్షత్రాలని తాకుతూ వృత్తమై ఆవృత్తంగా తిరుగుతూ అక్షయలోకంలో హాయిగా నవ్వింది!

కలలే వుంటాయి తీపిగా హాయిగా!

దోచుకోలేని సొత్తుగా స్వంతంగా అమృతంగా..!!

COMMENTS